**Andhra Jyothi**

# స్వయం ఉపాధికి కొత్త పథకం

## రాజీవ్ యువశక్తికి సవరణలు.. 18-35 ఏళ్ల మధ్య యువకులు అర్హులు

- **సెవన్త్ టు డిగ్రీ/డిప్లొమా చదివిన వారికి ఆర్థికసాయం**
- **కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం**

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాన్ని రూపొందించింది. రాజీవ్ యువశక్తి పేరుతో అమలైన పథకానికి సవరణలను చేసి నూతన స్వయం ఉపాధి పథకం అమలు మార్గదర్శకాలతో ఉత్తర్వులను జారీచేసింది. ఈమేరకు ప్రభుత్వ యువజనసర్వీసులశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉత్తర్వులను జారీచేశారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా 18నుంచి 35 వయస్సు కలిగిన నిరుద్యోగ యువతకు మూడు విభాగాలుగా ఆర్థికసాయం అందించనున్నారు. ఇందుకు ఏబీసీ స్కీంలను నిర్ణయించారు. ఏడో తరగతి నుంచి డిగ్రీ/డిప్లమా చదివి నిరుద్యోగులుగా ఉన్నవారికి స్వయం ఉపాధి కోసం ఆర్థికసాయం అందిస్తారు. స్వయం ఉపాధి పథకం కోసం 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులు. ఆదాయపరిమితి గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.1లక్ష.. పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలలోపు ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు ఉంటాయి.



## మూడు విభాగాలుగా ఆర్థికసాయం

- స్కీం ఏలో.: ఏడోతరగతి విద్యార్హత కలిగిన నిరుద్యోగులకు రూ.1లక్షవరకు ఆర్థికసాయం చేస్తారు. ఇందులో 80శాతం వ్యయాన్ని ప్రభుత్వం సబ్సిడీగా సమకూరుస్తుంది. మిగతా 20శాతానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుంది. అన్నిరకాల స్వయంఉపాధి అవకాశాలకు ఈ విభాగంలో ఆర్థికసాయం చేస్తారు.
- స్కీం బీలో.: పదోతరగతి వరకు చదువుకున్న యువతకు రూ.1.01లక్షల నుంచి రూ.2.లక్షల వరకు ఆర్థికసాయం లభిస్తుంది. యూనిట్‌కాస్ట్‌లో ప్రభుత్వం 70శాతానికి సబ్సిడీ కల్పిస్తే, మిగతా 30శాతానికి బ్యాంకు లోన్ ఇస్తుంది. సేవలు, పారిశ్రామిక స్వభావం కలిగిన ఉపాధి అవకాశాలకే ఈ విభాగంలో ఆర్థికసాయం అందుతుంది.
- స్కీం సీలో.: డిగ్రీ/డిప్లమా స్థాయి ఉన్నత విద్యార్హత కలిగిన నిరుద్యోగులకు రూ.2.01లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆర్థికసాయం చేస్తారు. యూనిట్ కాస్టులో ప్రభుత్వం 60శాతం మొత్తాన్ని లేదా రూ.5లక్షలు రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తానికి సబ్సిడీ కల్పిస్తుంది. మిగతా 40శాతానికి బ్యాంకులు రుణసాయం చేస్తాయి. సేవలు, పారిశ్రామిక స్వభావం కలిగిన ఉపాధి అవకాశాలకే ఈ విభాగంలో ఆర్థికసాయం అందుతుంది.

## దరఖాస్తుల పరిశీలన విధానం...

- స్కీం-సీ విభాగంలో వచ్చే ఉపాధిరంగాలను క్షుణ్ణంగా పరిశీలించాకనే ఆర్థికసాయం చేయటంపై నిర్ణయం తీసుకుంటారు.
- గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా, కుటీర పరిశ్రమలు నెలకొల్పే అభ్యర్థుల దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుంది.
- ఉన్నత విద్యార్హత కలిగిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకం కింద ప్రాధాన్యం కల్పించనున్నారు.
- బీ, సీ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థులు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. శిక్షణలో వారి ప్రతిభకనబర్చిన అభ్యర్థులే స్వయం ఉపాధి పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులవుతారు.

## పథకం అమలు విధానం..

- యువజన సర్వీసులశాఖ డైరెక్టర్- ఎండీ టీఎస్‌స్టెప్ స్వయం ఉపాధి పథకం లక్ష్యాలను జిల్లాలవారీగా నిర్ణయిస్తారు.
- మండలం/ మున్సిపాలిటీల్లో జనాభా ఆధారంగా జిల్లా స్టెప్ సీఈవో లక్ష్యాలను నిర్ణయిస్తారు.
- అర్హతకలిగిన నిరుద్యోగ యువత నుంచి ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులను ఆహ్వానిస్తారు.
- తమ మండలానికి విధించిన టార్గెట్‌కు అనుగుణంగా వచ్చిన దరఖాస్తులను మండల/మున్సిపల్ స్థాయి స్క్రీనింగ్ కమిటీ (ఎంఎల్ఎస్‌సీ) పరిశీలించి జిల్లా స్థాయి కమిటీకి ఆర్థికసాయం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపుతుంది.
- మండలస్థాయి బ్యాంకు మేనేజర్, స్టెప్ క్షేత్రస్థాయి అధికారి మండల స్థాయి స్క్రీనింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు.
- ఎంఎల్ఎస్‌సీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన జిల్లా స్థాయి కమిటీ లబ్ధిదారుల ఖాతాలోకి ఆర్థికసాయాన్ని జమచేసేందుకు అనుమతిని ఇస్తుంది.
- జిల్లాస్థాయి ఎంపిక కమిటీకి కలెక్టర్ సారథ్యం వహిస్తారు. లీడ్ బ్యాంకు మేనేజర్, డీసీసీ జీఎం, డీఆర్‌డీఏ పీడీ, అదనపు జేడీ, స్టెప్ సీఈవో కమిటీలో సభ్యులుగా ఉంటారు.
- తుది ఎంపిక పూర్తయ్యాక అభ్యర్థుల జాబితాను వారి బ్యాంకు అకౌంట్, ఫోన్ నంబర్లు డీవైఎస్ ఎండీకి పంపించటం జరుగుతుంది.
- లబ్ధిదారుని ఖాతాలో ఆర్థికసాయం జమఅయ్యే విషయంలో పూర్తి బాధ్యత జిల్లా స్టెప్ సీఈవోపైనే ఉంటుంది.